## రిపోర్టులు

# ఖమ్మం జిల్లా : అడవి ఘోష

ఖమ్మం జిల్లా మణుగూరు, అశ్వాపురం, బయ్యారం, పాల్వంచ, పినపాక మండలాలలోని అడవిప్రాంత గ్రామాల మీద పోలీసులు చాలా కాలంగా దాడులు చేస్తూ హరిజన గిరిజన పేద ప్రజానీకాన్ని తీవ్ర నిర్బంధానికి గురిచేస్తున్నారు. పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ 26, 27 తేదీలలో పగిడేరు, విజయనగరం, చిక్కుడుగుంట, సీతంపేట, గోపాలరావుపేట, కూనవరం, గొందిగూడెం గ్రామాలు పర్యటించి ఆ గ్రామాలలో జరిగిన అత్యాచారాలను గురించే కాక, ఉలవనూరు, వేగులూరు, మనుబోతుల గూడెం, నరసింహసాగర్, తుమ్మల చెరువు, భీమవరం గ్రామాలకు సంబంధించిన వాస్తవాలను కూడ సేకరించింది.

ఈ గ్రామాల ప్రజానీకాన్ని పోలీసులు తరచుగా అరెస్టుచేసి నిర్బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఊరిమీద దాడిచేసి స్త్రీలను అసహ్యకరమయిన పదజాలంతో తిడుతున్నారు. జనాన్ని పోగేసి కర్రలు విరిగేదాకా చావ గొడుతున్నారు. ఇళ్ళు పీకేస్తున్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికయిన గ్రామ సర్పంచ్‌లను బెదిరించి 'నక్సలైట్లతో సంబంధాలు తెంపుకొంటున్నా'మని ప్రకటనలు ఇప్పిస్తున్నారు. టెర్రరిస్టు చట్టం (TADA) క్రింద అరెస్టు చేసి కేసులు బనాయిస్తున్నారు. 'మేమేం తప్పుచేసామని జనం అడిగితే, అడవిలో తిరిగే నక్సలైట్ దళాలకు మీరుకాకపోతే ఎవడు అన్నం పెడుతున్నారు?' అని పోలీసులు ఎదురుప్రశ్న వేస్తున్నారు.

### నేపధ్యం

ఈ గ్రామాలు ఎక్కువగా దట్టమయిన అడవుల మధ్య వున్నాయి. వర్షాకాలంలో కాలినడకన తప్ప ఇతరత్రా ఈ గ్రామాలకు పోవడం కూడా సాధ్యం కాదు. దారి పొడవునా వాగులు వంకలు వొర్రెలు రాళ్ళు వున్నాయి. ఈ బాటలను చూస్తేనే ఈ ఈ గ్రామాల వెనుకబాటుతనం అర్థం అవుతుంది.

గ్రామస్తులు సగం కోయతెగకు చెందిన గిరిజనులు, మిగిలిన సగం పేద గిరిజనేతరులు. వర్షాధారమయిన ఒక పంట మాత్రమే ఈ భూములలో పండుతుంది. ఆపైన సంపన్న గ్రామాలలో వ్యవసాయ కూలికి పోవడమో లేకపోతే మణుగూరు, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలలోని గనులలోనూ పారిశ్రామిక కేంద్రాలలోనూ కూలికిపోవడమో చేస్తారు.

1988 మార్చి నెలలో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికలలో కొన్ని గ్రామాలలో డెమోక్రాటిక్ ఫ్రంటు పేరుమీద అభ్యర్థులు నిలబడ్డారు. మణుగూరు మండలంలోని రామానుజారం పంచాయితీకి, అశ్వాపురం మండలంలోని గొందిగూడెం, తుమ్మల చెరువు పంచాయితీలకు, పినపాక మండలం ఉప్పాక పంచాయితీకి, పాల్వంచ మండలం ఉలవనూరు పంచాయితీకి, గుండాల మండలం మామకన్ను గ్రామపంచాయితీకి, 'ఫ్రంట్' అభ్యర్థులుసర్పంచ్‌లుగా గెలిచారు. రామానుజారం సర్పంచ్‌గా ఎన్నికయిన గన్నెబోయిన వెంకన్న మణుగూరు మండలంఉపాధ్యక్షునిగా కూడ ఎన్నిక అయ్యారు. ఈ విజయాలను పోలీసులు న'క్సలైట్ల' విజయంగా భావించారు. అప్పటినుంచీ పైగ్రామాలమీద, ఎన్నికయిన సర్పంచ్‌లమీద, తీవ్రంగా దాడులు చేస్తున్నారు.

1988 సెప్టెంబర్ 14 న కూనవరం (కాలనీ) దగ్గర పోలీసులు నక్సలైట్ల మీద కాల్పులు జరపగా వాళ్ళు తప్పించుకొని పారిపోయారు. పోలీసులకు 1 తుపాకీ, 14,000 రూపాయల నగదు దొరికాయి. అప్పటినుండి పోలీసులు మణుగూరు మండలంలోని గ్రామాల మీద దాడులు తీవ్రతరం చేసారు.

1989 జనవరి 8న పినపాక దగ్గర నక్సలైట్లకూ పోలీసులకూ ఘర్షణ జరిగింది. నక్సలైట్లు తప్పించుకున్నారు. ఆ తరువాత పోలీసులు పినపాక మండలంలోని గ్రామాల మీద దాడులు తీవ్రతరం చేసారు.

1989 జూన్ 19వ తేదీన మణుగూరు మండలంలోని రేగులగండి చెరువు దగ్గర ఒక 'ఎన్‌కౌంటర్' జరిగి వెంకటేశ్వర్లు అనే నక్సలైట్ కార్యకర్త గాయపడి తప్పించుకున్నాడు. అతని కోసం వెతికే క్రమంలో పోలీసులు ఉలవనూరు, రేగులగండి, నరసింహసాగర్, వేగులూరు, మనుబోతుల గూడెం గ్రామాలలో నానాభీభత్సం సృష్టించారు.

### సర్పంచ్‌లపై నదాడులు

గ్రామపంచాయితీ ఎన్నికలలో గెలిచిన డెమోక్రాటిక్ ఫ్రంట్ సర్పంచ్‌లను పోలీసులు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. నక్సలైట్లతో తెగతెంపులు చేసుకున్నామంటూ ప్రకటన ఇయ్యవలసిందిగా ఒత్తిడి చేస్తున్నారు. ప్రజల రాజకీయ అభిప్రాయాలలో పోలీసులు ఈ విధంగా జోక్యం చేసుకోవడం చాలా హేయమయిన విషయం.

రామానుజారం సర్పంచ్ అయినటువంటి గన్నెబోయిన వెంకన్నను (ఇతను మణుగూరు మండల ఉపాధ్యక్షుడు కూడ) చాలాసార్లు అరెస్టుచేసి విపరీతంగా కొట్టారు. రేగులగరడి 'ఎన్‌కౌంటర్' ఘటన తరువాత ఉలవనూరు సర్పంచ్ అయిన వజ్జా నరసయ్యను అరెస్టు చేసి పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లో పెట్టి 15 రోజులు తీవ్రంగా కొట్టారు. వీళ్ళిద్దరినీ కొడుతూ 'నక్సలైట్లతో సంబంధాలు తెంపుకోమ'ని చెపుతూ కొట్టారు. ఆ విధంగా పత్రికా ప్రకటన ఇచ్చి 'సరండర్' కమ్మని బలవంతం పెట్టారు. రోకలి బండలు ఎక్కించి కొట్టారు. సర్పంచ్‌లనేకాక, వివిధ గ్రామాల నుండి ఆయా గ్రామ పంచాయితీలకు డెమోక్రాటిక్ ఫ్రంట్‌తరపున వార్డ్ మెంబర్లుగా ఎన్నికయిన వారిని కూడ ఇదే విధంగా హింసిస్తున్నారు.

## 'అన్నం' పెడుతున్నారని హింస

పగిడేరు, కొడిసెలకుంట, శ్రీరంగాపురం, మొట్లగూడెం, మాలపల్లి, గొల్లకొత్తూరు అనే ఆరు ఊళ్ళు మణుగూరు నుండి ఏటూరునాగారం వెళ్ళే రహదారికి దక్షిణం దిక్కున 10 కి.మీల దట్టమయిన అడవి గర్భంలో వున్న చెరువు క్రింద వున్నాయి. గొందిగూడెం, భీమారం, తుమ్మల చెరువు గ్రామాలు మణుగూరు నుండి పడమటి దిక్కున ఆరేడు కి. మీ. దూరాన అడవిలో వున్నాయి. ఉలవనూరు, నరసింహసాగర్, మనుబోతులగూడెం గ్రామాలు పాల్వంచ నుండి 20 కి.మీల దూరాన అడవి మధ్యన వున్నాయి.

ఇంత దట్టమయిన అడవులలో బ్రతికే జనం తప్పనిసరిగా నక్సలైట్ల మద్దతుదార్లు అయ్యేవుంటారని పోలీసుల గట్టినమ్మకం. సమయం దొరికినప్పుడల్లా వాళ్ళను పట్టుకొని చావబాదడం పోలీసులకు ఆట అయిపోయింది. వడిగేరు సమీపంలోని ఆరుగ్రామాల మీద గత రెండేళ్ళలో కనీసం 20 సార్లు దాడిచేసి వుంటారు. ముఖ్యంగా, పంచాయితీ ఎన్నికలప్పటి నుండి ఇది ఎక్కువ అయింది. ఊళ్ళలోని జనాన్ని వంద-రెండువందల మందిని ఒక చోట పోగేసి పోలీసులు చుట్టూనిలబడి కర్రలు విరిగేదాకా కొడుతున్నారు. స్త్రీ పురుష విచక్షణ లేకుండ కొడుతున్నారు. వేతపల్లి వెంకమ్మ అనే స్త్రీకి ఈ దెబ్బలకు చేయి విరిగింది. ఆమె కొడుకు ముత్యలింగంను చెట్టుకు కట్టేసి కాలుస్తామని బెదిరించి, ఆమె అడ్డంపోగా ఆమెను బాగా కొట్టి ఇద్దరినీ వదిలేసారు. ఈ గ్రామాల నుండి ఎన్నికయిన ప్రజా ప్రతినిధులు ఏపనిమీదయినా మండల ఆఫీసుకుపోయినా సరే దారిలో పట్టుకొని కొడుతున్నారు. ఒక్కొక్క దాడి తర్వాత 50, 100 మందిని మణుగూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయి రెండు మూడు రోజులు బాగా కొట్టి వదిలిపెడుతున్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరినెలలో ఖమ్మంలో జరిగిన పిడిఎస్‌యు మహా సభలకు వస్తూన్న వాళ్ళను పాల్వంచ దగ్గర లారీ దింపి ఫుట్‌బాల్ అడుకున్నట్టు బూటుకాళ్ళతో తన్నారు.

గొందిగూడెం, తుమ్మల చెరువు, భీమారం గ్రామాలకు చెందిన ప్రజలుకూడ ఇదేరకమయిన హింసను నిష్కారణంగా అనుభవిస్తూవున్నారు. రామదాసు, జనార్థన్ అనేయువకులను పదే పదే అరెస్టుచేసి విపరీతంగా కొట్టారు.

రేగులగండి 'ఎన్‌కౌంటర్' తరువాత ఉలవనూరు, వేగుబూరు, రేగులగండి, మనుబోతులగూడెం నరసింహసాగర్‌లకు చెందిన వాళ్ళను ఇదే విధంగా గుంపుచేసి పదేపదే చావబాదారు. దాదాపు 10 రోజులు ఈ కార్యక్రమం కొనసాగించారు. సర్పంచ్ వజ్జా నరసయ్యనే కాక మరొక 11 మందిని అరెస్టుచేసి చిత్రహింసలకు గురి చేసారు.

## పౌర జీవితంలో జోక్యం

పోలీసులకు ఏ సంబంధమూలేని పౌర జీవితంలో వాళ్ళు జోక్యం చేసుకొని, 'నక్సలైట్ల సానుభూతిపరుల'గా తాము భావిస్తూన్న వారిని హింసిస్తున్నారు. పినపాక గ్రామ పంచాయితీలోని గోపాలరావుపేట గ్రామానికి చెందిన కూలివాళ్ళు రెండేళ్ళ క్రితం సమ్మెచేసి జీతగాళ్ళ జీతాన్ని 1200 రూ॥ నుండి 2400 రూ॥లకు పెంచుకున్నారని, అప్పటి నుండి బయ్యారంకు చెందిన పోలీసులు వాళ్ళమీద దాడులు చేస్తూ 'మీరు నక్సలైట్లకు ఆశ్రయం ఇస్తున్నారు', అని కొడుతున్నారు. సీతంపేటకు చెందిన గండారపు సమ్మక్క గ్రామాలలో తిరిగి కూలివాళ్ళ కూలిరేట్ల పెంపుదలకోసం కృషి చేస్తోందని ఆమె యింటి మీద దాడి చేసి తలుపులు పగలగొట్టి ఇంట్లోని రేడియోను ఇతర సామాగ్రినీ ధ్వంసం చేసారు. గోపాలరావుపేటకు చెందిన కొండచంద్రయ్య ఇంట్లోకూడ సామాగ్రినీ వస్తువులనూ ధ్వంసం చేసారు. కుండలు పగలగొట్టి మంచం నవారు కోసేసారు.

గొందిగూడెంలో కిరాణావ్యాపారం చేస్తూన్న రామస్వామి అనే తమిళుడు నక్సలైట్లకు సరుకులు సరఫరా చేస్తున్నాడన్న నెపంమీద అతన్ని పదేపదే అరెస్టుచేసి కొట్టి హింసించారు. అతను ఈ బాధలుపడలేక వూరువదిలి తమిళనాడుకు వెళ్ళిపోయాడు.

చిక్కుడు గుంటలో రాసూరి నర్సయ్య అనే వ్యక్తి కొడాలి పమ్మయ్య అనే మరొకనికి ఒక సెంటు భూమి ఇచ్చి రోడ్డుపక్కన వుండే 10 సెంట్లభూమి తీసుకునే ఒప్పందం చేసుకున్నాడు. దాని ప్రకారం తాను తీసుకున్న భూమిలో ఇల్లువేసుకున్నాడు. పోలీసులు ఇందులో నిష్కారణంగా జోక్యంచేసుకొని నర్సయ్య వేసుకున్న ఇంటిని కోర్ట్ ఆర్డర్ లేకుండానే మొత్తం కూల్చేసారు.

## 'టాడా' కేసులు

ఈ విధంగా కొన్ని వందల మందిని గత రెండేళ్ళగా కొట్టి అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలు పెట్టడమే కాక, 7గురి మీద టెర్రరిస్టు చట్టం ('టాడా') క్రింద తప్పుడు కేసులుపెట్టి జైలుపాలు చేసారు. ఈ వ్యక్తులు సీతంపేటకు చెందిన మోహనరావు, రాగిరి భిక్షం, గొందిగూడెంకు చెందిన రామదాసు, రామానుజారంకు చెందిన దాచేపల్లి పిచ్చయ్య, చిక్కుడుగుంటకు చెందిన రాసూరినర్సయ్య, ఇందర్ప నర్సయ్య, పాల్వంచకు చెందిన అనుగాజు బ్రహ్మం.

ఈ నిర్బంధం యావత్తు ఉద్దేశ్యపూర్వకంగా, ఒక పద్ధతి ప్రకారం జరుగుతోందనడంలో సందేహంలేదు. 'శాంతి భద్రతల' సంరక్షణలో భాగంగా ఈ అత్యాచారాలు జరిగాయనడానికి ఈ ప్రాంతంలో అసలు శాంతి భద్రతలకు కలిగిన విపత్తేమిలేదు. నక్సలైట్లకు అన్నంపెట్టడం, వాళ్ళపట్లసానుభూతి కలిగివుండడం, రైతుకూలీసంఘం పెట్టుకొని జీతగాళ్ళ జీతాలు పెంచుకోవడం, ఎన్నికలలోపాల్గొని సర్పంచలుగా గెలవడం, ఏ చట్టంప్రకారమూ

నేరాలుకావు. పోలీసు యంత్రాంగం నక్సలైటు ఉద్యమాన్నే ఒక 'శాంతిభద్రతల' సమస్యగా భావించి దానిని నామరూపాలులేకుండా చేయడానికి కంకణం కట్టుకొని నిర్వహిస్తోన్న కార్యక్రమమేయిది కార్యక్రమానికి ప్రభుత్వం ఆమోదమూ ప్రోద్బలమూ లై పెన్సు లున్నాయని వేరే చెప్పనవసరం లేదు.

ఈ నిర్ధారణకు నిజనిర్ధారణ కమిటీ వచ్చిన తర్వాత ఈ దినం ఉదయం వివిధగ్రామాల ప్రజలను తీసుకొని పౌర హక్కుల సంఘం బాధ్యులు ఖమ్మం జిల్లా కలెక్టరును కలవడం జరిగింది. జిల్లా కలెక్టర్ గారు ఆర్.డి.వో. చేత విచారణ జరి పించి తగుచర్య తీసుకుంటానని హామీ యిచ్చారు.